క్లుప్తంగా

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 30న జాబ్‌మేళా

ఎంవీపీ కాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉపాధి కల్పన మిషన్(సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాలో 2 కంపెనీల్లో 350 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు డీఆర్‌డీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, డక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి జరిగే ఈ మేళాలో ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు పెందుర్తిలోని జిల్లా సమైక్య భవన్‌లో సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 95029 20896 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సందడిగా వేసవి శిక్షణ శిబిరాలు



పిల్లలకు గుడ్లు, బిస్కెట్లు అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి, జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు సందడిగా సాగుతున్నాయి. ఆరిలోవ ప్రాంతంలో పిల్లలకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 12వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి సందర్శించారు. అనంతరం పిల్లలకు జీవీఎంసీ పంపిణీ చేసిన పాలు, గుడ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లలకు ఇలాంటి శిక్షణలు మానసిక శారీరక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 247 మంది రాయాల్సి ఉండగా.. 11 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 56 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఆమె తెలిపారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ద్రవరూప స్ఫటికాలు అంశంపై నిర్వహిస్తున్న 30వ జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ, ఏయూ ఫిజిక్స్ విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు ఏయూలో నిర్వహించనున్నట్టు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య టి.శోభశ్రీ భౌతికశాస్త్ర విభాగాధిపతి వెంకటాద్రి, ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు అర్చన, మంగళాశాసనం, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తారు.

కాలువలకు మోక్షమెప్పుడో?

- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- పూడిక పోయి ఎక్కడి మురుగు అక్కడే



ఆరిలోవ హిందీ కాలేజీ వద్ద శిథిలమైన కాలువ



టీబీసీ పాయింట్ వద్ద సిమెంట్ పలకలతో మూసేసిక కాలువ

ఆరిలోవ: అధ్వాన కాలువలకు ఏళ్ల తరబడి మోక్షం కలగడం లేదు. శిథిలావస్థకు చేరి పూడికపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆరిలోవ ప్రాంతంలో కాలువలు శిథిల స్థితికి చేరాయి. గోడలు పెచ్చులూడిపోయాయి. అడుగు భాగాలు గోతులు పడ్డాయి. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, నెహ్రూనగర్, లీలాసుందరినగర్, టీబీసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్, ముస్తాఫా కాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో ఇళ్లల్లో వాడుక నీరు సజావుగా కిందకు పోవడానికి వీల్లేకుండా పోయింది. ఎక్కడ నీరు అక్కడే రోజుల తరబడి నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద ఎక్కువైంది. మరోవైపు కాలువలు గోడల మట్టి, చెత్తతో పూడికపోయాయి. జీవీఎంసీ శానిటరీ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలల తరబడి ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంది. పారిశుధ్య సిబ్బంది ప్రధాన రహదారులను శుభ్రం చేసి కాలువల్లో పూడిక తీయకుండా వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటితో పాటు పలు వీధి కాలువలదీ కూడా ఇదే పరిస్థితి.

సిమెంట్ పలకలతో మూసేశారు.!

కాలువలు శిథిలమై చెత్తతో పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులకు ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన షాపులతో మరింత అవస్థలు పడుతున్నారు. వ్యాపారులు తమ షాపుల ముందు కాలువలను సిమెంట్ పలకలతో మూసేశారు. కొందరు శాశ్వతంగా శ్లాబులు వేయగా, ఇంకొందరు సిమెంట్ పలకలు వేశారు. దీంతో పారిశుధ్య సిబ్బంది కాలువల్లో చెత్త బయటకు తీయలేని పరిస్థితి నెలకొంది. తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుందని చెప్పడంతో పారిశుధ్య సిబ్బంది కాలువల్లో చెత్త తీయకుండా వదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లలో కాలువలు పరిస్థితి మరింత అధ్వారంగా మారాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 పద్మజ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారాపై అధికారులకు నివేదించి, ఆ సమస్య సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి ఒకటి, జోన్–3 నుంచి రెండు, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి రెండు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ–1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వి రాజక్‌ను అభినందించిన కలెక్టర్



పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : విశాఖకు చెందిన పూర్వి రాజక్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్–2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ పూర్వి రాజక్‌ను అభినందించారు. 12 సంవత్సరాల వయస్సు గల పూర్వి రాజక్ కళ, సాహిత్యం, క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె తన మూడు సంవత్సరాల వయసులో మొదటి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు గెలుచుకుంది. స్కూలు, ఇంటర్ స్కూలు, డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, కవయిత్రి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా విజయాలు సాధించి బంగారు పతక విజేతగా నిలిచింది.

త్వరితగతిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు

- అధికారులకు ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు ఆదేశం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు

ఆనందపురం : నిర్మాణ పనులు పూర్తి అయిన టిడ్కో ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని దబ్బందలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బందలో 1920 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా, 1728 ఇళ్ల పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. పూర్తయిన బ్లాకుల వద్ద బీటీ రోడ్లు, కాలువలు, వంతెనలు, విద్యుత్, భూగర్భ డ్రైనేజి వ్యవస్థలతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణ సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అవకాశాలున్నాయని, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతోన్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. వెల్లంకిలో అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గుడిలోవలో జరుగుతున్న భూ రీసర్వేను, లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, డీపీవో చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891- 2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొఫైల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐడీజేఎన్ సభ్యులు

బీచ్ రోడ్డు: రాష్ట్ర వ్యాప్తంగా దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్‌వర్క్(ఐడీజేఎన్) సభ్యులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో పలు చోట్ల దళిత జర్నలిస్టులపై దాడులు, తప్పుడు కేసులు నమోదవుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు పాత్రికేయులకు 300 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, సహాయ కార్యదర్శి పి.సత్యనారాయణ, జిల్లా ప్రతినిధులు గొట్టివాడ ధనేష్, జి.ఆనంద్ పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు వస్త్రదానం



స్వరూపానందేంద్ర స్వామి సమక్షంలో వస్త్రాలు అందిస్తున్న రామదాసు దంపతులు

మత్రిపాలెం: పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో మురళీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిరసాని రామదాసు, లక్ష్మీబాయి దంపతులు శుక్రవారం శారదా పీఠంలో కొలువైన శంకరాచార్యులు స్వామికి వెండి పాదుకలను బహూకరించారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా అక్కడి వేద విద్యార్థులకు స్వామీజీ చేతుల మీదుగా వస్త్రదానం చేశారు. స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ, జి.వి.రమణ, ఎస్.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా సందర్శన

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనాను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు శుక్రవారం ఉదయం సందర్శించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన ఈ పార్కును సందర్శించి వాకర్స్‌తో పలు విషయాలను పంచుకున్నారు. పార్కులోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్ అధ్వానంగా ఉందన్నారు. రాళ్లు పైకి తేలిపోవడంతో వాకర్స్ కాళ్ల నొప్పులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పార్కు నిర్వహణపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్కు ప్రధాన ద్వారా పక్కనే విశ్రాంతి కోసం నిర్మించిన షెల్టర్ కూలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై దారుణమన్నారు. ఇప్పటికైనా పార్కులో సమస్యలను వీఎంఆర్‌డీఏ అధికారులు పరిరక్షించాలన్నారు. వాక్ అండ్ టాక్ విత్ ఎంపీ జీవీఎల్ పేరిట విశాఖలోని పలు పార్కుల్లో మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజలతో మమేకమవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీర్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు గైర్హాజరుపై ఆర్జేడీ ఆగ్రహం

- పరీక్షలపై నిర్లక్ష్యం తగదు
- 6గురు సీఎస్, 18 డీవోలకు మెమోలు జారీ చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలకు సన్నద్ధం చేసేందుకని నిర్వహించే సమావేశాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు గైర్హాజర్ కావడం తీవ్రంగా పరిగణించాల్సిందేనని విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ పరీక్షలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించారు. అయితే కీలకమైన సమావేశానికి పలువురు సీఎస్, డీవోలు గైర్హాజరయ్యారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు జిల్లాలో 5,981 మంది హాజరౌతుండగా, వీరి కోసమని 24 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. అయితే శుక్రవారం నాటి సమీక్ష సమావేశానికి సీఎస్‌లు 24 మందికి గాను 18 మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు కేవలం 6 గురు మాత్రమే వచ్చారు. దీనిపై ఆర్జేడీ జ్యోతి కుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

గైర్హాజరైన వారందరికీ మెమోలను జారీ చేసి, వారి నుంచే వచ్చే సంజాయిషీ వివరాలను కూడా తనకు నివేదించాలన్నారు. డీఈవో జి. లక్ష్మణరావు, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, డెప్యూటీ డీఈవో గౌరీ శంకర్, సిబ్బంది భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న గాయని భావన

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. గుమ్ములూరి శారద సుబ్రహ్మణ్యం శిష్యురాలు భావనా యదవిల్లి తన అద్భుత గానంతో ముత్తుస్వామి, రామదాస, అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. శ్రీ సకల గణాధిక పాలయమాం, ఎవరురా, నను బ్రోవమని, కంటి శుక్రవారం, శ్రీ చక్రరాజ సింహాసనేశ్వరి, తాయ రాగమాలికా థిల్లానా, కనకధారా స్తోత్రం ఆలపించారు. ఈమెకు కోట గాయత్రి వరేణ్య వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని భావనను సత్కరించారు.

25 ద్విచక్ర వాహనాలు సీజ్

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి సమయంలో అనవసరంగా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

25 బైకులను సీజ్ చేసి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టండి



బీచ్‌రోడ్డులో వర్షపు నీటి నిల్వపై ఆరా తీస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: బీచ్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద ప్రధాన కాల్వలను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నెలకు రెండుసార్లు ప్రధాన కాలువల పూడికలు తొలగించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ కూడా శుభ్రపరచాలన్నారు. వర్షాకాలంలో ప్రధాన కాలువలు పొంగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీటితో పాటు పూడికలు అధికంగా వస్తాయని, అలా రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ అటవీశాఖ అధికారి అనంతశంకర్‌తో కలిసి వైఎస్సార్ వ్యూ పాయింట్, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బీచ్ అభివృద్ధికి కావల్సిన అనుమతులపై చర్చించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్లు సత్యనారాయణ, వేణుగోపాల్, ఏఎంవోహెచ్ డాక్టర్ ఎన్. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



క్లోక్ రూం సమీపంలో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8లోని క్లోక్ రూం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్లాట్‌ఫాం నంబర్ 8 చివరలో 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శుక్రవారం మృతి చెంది ఉన్నాడు. మృతుడి గురించి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు



జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) శ్రీనివాస మూర్తి అధ్యక్షతన కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగింది. జూన్ 1 నుంచి 30 వరకు చైల్డ్ లేబర్ వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ జిల్లా అధికారి ఎం.సునీత తెలిపారు. 2025 నాటికి బాల కార్మికులు ఎవరూ ఉండకూడదనే నిబంధనతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్మిక శాఖకు ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లి చైల్డ్ లేబర్ వ్యవస్థను రూపుమాపి బాలలకు విముక్తి కలిగించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమ, ఏసీపీ వెంకటరావు, డీపీవో శరత్‌బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి రాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారమ్

సెల్‌ఫోన్ పోయిందా.. 94906 17916కు మెసేజ్ చేయండి



క్రైం పోలీస్ స్టేషన్ వద్ద అతికించిన పోస్టర్

సీతమ్మధార: మీ విలువైన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారా.. వెంటనే 94906 17916 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయండి.. మేం ఎక్కడుందో కనిపెట్టి ఇస్తాం.. అని క్రైం పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద ఈ పోస్టర్లు వెలిశాయి. దీంతో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారికి కొంత మేలు జరుగుతోంది. పైన పేర్కొన్న వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే.. వెంటనే మీకు మిస్సింగ్ మొబైల్ ఫ్రమ్ అని వస్తుంది. అందులో ఫిర్యాదు చేయండి.. లేదనుకుంటే ఇందులో పొందుపరిచిన ‘క్యూఆర్ కోడ్’ను స్కాన్ చేయాలని ప్రకటించారు. దీంతో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారు పోస్టర్‌లోని నంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకుంటున్నారు. పోలీస్ కమిషనర్ మంచి నిర్ణయం తీసుకున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.